

ఓదెల మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు బోనాలతోపాటు పట్నాలు వేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు బుధవారం గిడ్డంగుల నిర్వహణ, నీటి శాంపిళ్ల సేకరణ, ప్రయోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండగా, ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది. రాత్రివేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దాహం తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు


నీరు తాగుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ఎండల తీవ్రత అధికంగా ఉందని, బస్సు ప్రయాణికులతోపాటు కలెక్టరేట్‌కు పనుల నిమిత్తం వచ్చే వివిధ ప్రాంతాల ప్రజల దాహం తీర్చేందుకు చల్లని తాగునీటిని అందించేందుకే చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. చలివేంద్రంలో చల్లని నీటిని అందుబాటులో ఉంచి ఇక్కడికి వచ్చే వారికి అందించాలని అన్నారు. ఏవో శ్రీనివాస్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగుతున్న విద్యుత్ దీపాలు


పాతకోర్టు వద్ద విద్యుద్దీపకాంతులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపల్లిరూరల్: స్థానిక అమర్‌నగర్(పాతకోర్టు) చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. సుందరీకరించిన ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జెండాలు తొలగించి, ఫ్లెక్సీలు కూడా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'యువికా'కు విద్యార్థిని ఎంపిక


సాయివర్షిత

పాలకుర్తి(రామగుండం): కన్నాల జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న తోడేటి సాయివర్షిత ఇస్రో యంగ్ సైంటిస్ట్ శిక్షణ(యువికా)కు ఎంపికైంది. మేలో ఇస్రోకు చెందిన 7 పరిశోధన కేంద్రాల్లో అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండువారాల పాటు ఆవాస శిక్షణ ఇస్తారు. ఇందుకు సాయివర్షిత ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు కమలాకర్ రావు, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ డిపోకు మరో భవనం


డిపో కోసం కేటాయించిన భవనం ఇదే

పెద్దపల్లిరూరల్: జిల్లా తూనికలు, కొలతల శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయించి ఆ భవనాన్ని కూడా ఆర్టీసీ బస్‌డిపోకు అప్పగించారు. తూనికలు, కొలతల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ లోకి ఇటీవల మార్చారు. పాలశీతలీకరణ కేంద్రం, జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయాలు ఇంకా తమ సొంతభవనాల్లోనే పనిచేస్తున్నాయి. వాటిని కూడా తొలగిస్తారనే ప్రచారం ఉంది. అయితే పాలశీతలీకరణ కేంద్రం పాడి రైతులకు అనువుగా ఉందని, భవనం కూడా ఇటీవలే నిర్మించిందని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని కూడా త్వరలోనే ఖాళీ చేయించే అవకాశాలున్నట్లు సమాచారం.

పత్తి క్వింటాల్ రూ.7,359

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,359 ధర పలికింది. కనిష్ఠంగా రూ.5,511, సగటు రూ.7,033గా ధర నిర్ధారించామని ఇన్‌చార్జి కార్యదర్శి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

23 వరకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈనెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మాధవి తెలిపారు. రాష్ట్రంలో 35 గురుకుల జూనియర్ కాలేజీలు(20 బాలికలు, 15 బాలురు) ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని, దరఖాస్తుదారులకు మే 10న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగానే సీట్లు కేటాయిస్తారన్నారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని, వివరాల కోసం 040-24734899 ఫోన్‌నంబరులో సంప్రదించాలని తెలిపారు.

జలం.. గరళం


- పవిత్ర గోదావరిలో కలుస్తున్న వ్యర్థాలు
- నేరుగా తాగేందుకు పనికిరావంటున్న అధికారులు
- ఫిల్టర్ చేయడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం
- ఇంకా నిర్మాణ దశలోనే ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్

కలుషిత నీటితో ఇప్పటి వరకు నమోదైన కేసులు

హైపటైటిస్ : 6 పాజిటివ్(రెఫరల్)
ఆస్పత్రిలో చేరినవారు : 30మంది


గోదావరిలో కలుస్తున్న మురుగు, నీటిపై నురగ


నిర్మాణంలో ఉన్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్


నీటికి అడ్డుకట్ట వేసిన సింగరేణి అధికారులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

గోదావరిఖని: పవిత్ర జలాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. వ్యర్థాలు, రసాయనాలు, మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రంగు, రుచి మారి కంపు కొడుతున్నాయి. ఈ నీరు తాగడానికి కాదు కదా.. రోజూవారి అవసరాలకు కూడా పనికిరాదని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నా.. కార్మిక కాలనీలకు గోదావరి నీరు తప్ప మరోమార్గంలేకుండాపోయింది.

నీటికి అడ్డుకట్ట వేసి..

గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీల్లోని కార్మిక కుటుంబాలతో పాటు సింగరేణి క్వార్టర్లకు ఆనుకుని ప్రైవేట్‌కాలనీలకూ గోదావరి నీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం గోదావరిఖని సమీపంలోని ఇంటెక్‌వెల్ నుంచి పంపుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం నదిలో నీటి లభ్యత తగ్గింది. ఎగువ నుంచి వచ్చే వ్యర్థాలు నదిలోని కొద్దిపాటి నీటిలో కలుస్తున్నాయి. ఆ నీటికే అడ్డుకట్ట వేసిన సింగరేణి యాజమాన్యం.. పంపింగ్ చేస్తూ కార్మిక కాలనీలకు తరలిస్తోంది.

బొగ్గు గనుల నీరు కలిపి..

గోదావరిఖని ప్రాంతానికి రోజూ 18 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) యైటింక్లయిన్‌కాలనీకి 8 ఎంఎల్‌డీ, సెంటినరీకాలనీకి 5 ఎంఎల్‌డీ నీటిని యాజమాన్యం అందిస్తోంది. అయితే, గోదావరి నీరు సరిపోక ఆర్జీ–1, 2, 3 ఏరియాల్లోని బొగ్గు గనుల నుంచి వెలువడే నీటిని ఫిల్టర్‌బెడ్‌లో శుభ్రం చేసి సరఫరా చేస్తున్నారు. ఈనీరు జిడ్డుగా ఉంటోందని కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

నగర మురుగు నదిలోకే..

రామగుండం నగరంలో రోజూ వెలువడే 32 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు గోదావరి నదిలోనే కలుస్తున్నాయి. సీవరేజ్ ప్లాంట్లు ఉన్నా.. జీవితకాలం ముగియడంతో పనిచేయడం లేదు. దీంతో వ్యర్థాలు, డ్రైనేజీ నేరుగా నదిలో కలుస్తున్నాయి. ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

నేరుగా ఆర్ఎఫ్‌సీఎల్ వ్యర్థాలు కూడా..

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే వ్యర్థాలు కూడా గోదావరి నదిలో కలుస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఆ సంస్థకు నోటీసులు జారీ చేశారు. అయినా, నదీజలాలు విషతుల్యమవుతూనే ఉన్నాయి.

వ్యాధుల బారినపడుతున్న కార్మికులు

గోదావరి నీటిని ఫిల్టర్లలో శుభ్రం చేసి కార్మిక కాలనీలకు పంపింగ్ చేస్తున్నారు. ఫిల్టర్లలో సరిగా శుభ్రంకాక ఆ నీటిని తాగుతున్న వారు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా హైపటైటిస్–ఏతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. కలుషిత నీటితోనే హైపటైటిస్ బారిన పడుతున్నారని సింగరేణి వైద్యాధికారి ఉత్తర్వులు జారీచేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

నిర్మాణ దశలో ర్యాపిడ్ గ్రావిటీ

జీడీకే–2ఏ సమీపంలో రూ.14.5 కోట్ల వ్యయంతో 35ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన గ్రావిటీ ఫిల్టర్‌ను సింగరేణి ఏర్పాటు చేస్తోంది. జూలై వరకు నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే మిషన్ భగీరథ తరహాలో కార్మిక కుటుంబాలకు మినరల్ వాటర్ అందుతుంది.

బట్టల మురికి పోతలేదు



నల్లాల ద్వారా వచ్చేనీటిలో ఆయిల్ కలుస్తంది. స్వచ్ఛమైన గంగనీరు వస్తలేదు. బట్టలు ఉతికితే మురికి పోతలేదు. నీళ్లు జిడ్డుగా ఉంటన్నయ్. ఎండాలం పోయేదాకా మిషన్ భగీరథ నీటిని ఇవ్వాలి.
– ధామసాని లావణ్య, తిలక్‌నగర్, గోదావరిఖని

కలుషిత నీరు తాగొద్దు

ఇంట్లోని ఆర్వో వాటర్ ఫిల్టర్‌లో నీరు పూర్తిగా శుభ్రం కాదు. ఇలాంటి నీరు తాగినవారు హైపటైటిస్ బారినపడుతున్నారు. బాధితులు నీరు, ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.
– పద్మ, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, సింగరేణి

తాగేందుకు పనికిరాదు



నదిలో తరచూ నురగ వస్తోంది. ఇలాంటి సమయాలతోపాటు తరచూ నీటి శాంపిళ్లు తీసుకుని పరీక్షిస్తున్నాం. నివేదికను మా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నాం. గోదావరి నీరు నేరుగా తాగేందుకు పనికిరాదు.
– భిక్షపతి, ఈఈ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎన్టీపీసీ

పింఛన్ పెరిగే వరకూ పోరు


అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ

గోదావరిఖనిటౌన్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ పెరిగే వరకూ పోరాటం చేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. నగరంలో బుధవారం ఆయన పర్యటించారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కనీస పింఛన్ రూ.10వేలకు పెంచాలని కేంద్రమంత్రిని డిమాండ్ చేయగా ఆయన స్పందించారని తెలిపారు. ఎన్టీపీసీ నిర్వాసితులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశానని అన్నారు. దళితుల అభ్యున్నతికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఎంపీ పేర్కొన్నారు.

నీటి నిల్వకు స్థలాల గుర్తింపు


స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు ఆర్జీ–1 ఏరియాలో నీటి నిల్వల కోసం పలు ప్రాంతాలను అధికారులు బుధవారం గుర్తించారు. 'సింగరేణి నీటిబిందువు – జల సింధువు'లో భాగంగా మూతపడిన మేడిపల్లి ఓసీపీ పరిసరాల్లోని 6.26 హెక్టార్ల విస్తీర్ణంలో 7 ట్యాంక్‌లను నిర్మించేందుకు స్థలాలను గుర్తించారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సివిల్ ఎస్ఈ వరప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, మేనేజర్ మల్లికార్జున్‌యాదవ్ ఉన్నారు.

వలంటీర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఆర్డీవో కాళిందిని, డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేసవి సెలవుల్లో బోధించేందుకు వలంటీర్లు కావాలని, ఆసక్తిగల డిగ్రీ విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం స్థానిక సంస్థలు, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సర్కారు బడుల విద్యార్థులకు సమ్మర్ క్యాంపుల ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. ఇందులో డిగ్రీ విద్యార్థులు వలంటీర్లుగా సేవలు అందించేందుకు ముందుకు రావాలని సూచించారు. టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ఈనెలాఖరులోగా రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను పరిశీలించాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను గుర్తించి మే 10లోగా నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇలాంటి వారిని గురుకులాల్లో చేర్పిస్తామని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించిన గ్రామాలకు మంజూరైన 1,940 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఆదేశించారు. బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తయితే తొలివిడత రూ.లక్ష విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈనెల 11న ప్రతీపల్లె, పట్టణం, వార్డులో ఆరేళ్ల లోపు వయసుగల పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎత్తు, బరువు తక్కువ పిల్లలకు బాలామృతం ప్లస్, ఇతర పోషకాహారం అందించాలన్నారు. జెడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీవో కాళిందిని, డీపీవో వీరబుచ్చయ్య, డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి

ఓదెల(పెద్దపల్లి): భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈఈ జగదీశ్ పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి ఎర్రరంగు దారం వాడాలి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని, సన్నరకం ధాన్యం బస్తాలను ఎర్రరంగు, దొడ్డురకం ధాన్యాన్ని పచ్చరంగు దారంతో సంచులు కుట్టేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ వేణు ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. తూకం యంత్రాలు, టార్పాలిన్, గన్నీసంచులు, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. సన్న, దొడ్డురకం ధాన్యాన్ని సులభంగా గుర్తించేలా సన్నరకం ధాన్యాన్ని ఎర్రరంగు దారంతో కుట్టించి ఎరుపు రంగుతో ముద్ర వేయించాలన్నారు. దొడ్డురకం ధాన్యాన్ని పచ్చరంగు దారంతో కుట్టేలా చూడాలన్నారు. హమాలీలు, కాంటాలు వేర్వేరుగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకే ధాన్యం తరలించాలని, అక్రమాలకు పాల్పడ్డట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇదే చి'వరి' తడి

- గడువు ముగిసింది.. అయినా నేటినుంచి ఎస్సారెస్పీ నీరు అందిస్తాం
- అన్నదాతలు సాగునీటిని వృథా చేయొద్దు
- ఎమ్మెల్యే విజయరమణారావు


లాండ్రీషాపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు

పెద్దపల్లిరూరల్: చివరి ఆయకట్టుకు ఇదేచివరి తడి అని, గురువారం(ఈనెల 10) నుంచి ఎస్సారెస్పీ కాలువల ద్వారా పంటలకు సాగునీరు సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాసంగిలో పండిస్తున్న వరి, మొక్కజొన్న తదితర పంటలకు సాగునీరు అవసరమని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ డి–83, డి–86 కాలువల ద్వారా సరఫరా అయ్యే నీటిని రైతులు అవసరం మేరకు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బాధితుడికి బాసటగా నిలిచి..

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఎలబోతారం రమేశ్ కుటుంబానికి విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకుడు అల్లం వినోద్‌రెడ్డి ఆర్థికసాయం అందించడంతో భూంనగర్ ప్రాంతంలోని లాండ్రీ షాపును ఎమ్మెల్యే విజయరమణారావు పునఃప్రారంభించారు. నాయకులు జగదీశ్, శ్రీనివాస్, సంపత్, అమ్రేశ్, సుభాష్‌రావు, డీపీఎస్‌మూర్తి, అస్లాం ఉన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

ఓదెల(పెద్దపల్లి): గోపరపల్లె గ్రామానికి చెందిన యాసం మణెమ్మకు పొత్కపల్లి సొసైటీ ద్వారా మంజూరైన రూ.లక్ష విలువైన ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు మండలంలో ఎమ్మెల్యే పాదయాత్ర

ఎలిగేడు(పెద్దపల్లి): ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు బుధవారం ర్యాకల్‌దేవ్‌పల్లి నుంచి రాములపల్లి గ్రామం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. నాయకులు ప్రకాశ్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింహయాదవ్, వెంకటేశ్వర్‌రావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆనవాళ్లు కోల్పోయిన కాలువలు

- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- చెత్తాచెదారంతో పేరుకుపోయిన పూడిక
- కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరిన కెనాల్స్
- సాగునీటి పారకానికి తీవ్ర ఆటంకం
- ఎండుతున్న చివరి ఆయకట్టు పంటలు
- సుమారు 4వేల ఎకరాలు ప్రశ్నార్థకం

ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు.. కమ్ముకుపోయిన తుంగ.. పేరుకుపోయిన చెత్తాచెదారం.. వెరసి అధికారుల నిర్వహణ లోపం జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువలు అస్తవ్యస్తంగా తయారవడానికి కారణమయ్యాయి. ఫలితంగా చివరి ఆయకట్టు ఏమోగానీ.. కాలువలకు అతిసమీపంలో ఉండే పంట పొలాలకూ చుక్కనీరు అందని దుస్థితి నెలకొంది.


మంథని శివారులో తుంగతో నిండిన సాగునీటి కాలువ

సాక్షి ఫొటో


అంగలూరు శివారులో ఆనవాళ్లు కోల్పోయిన కాలువ


ముత్తారం శివారులో..

మంథని: జిల్లాలో సాగునీటి కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రధాన కాలువలు మొదలు పిల్లకాలువల నిర్వహణ, మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే లేక వాటి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పిచ్చిమొక్కలు, పెద్దచెట్లు ఏపుగా పెరుగుతూ సాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి.

80 కి.మీ. పొడవున అదేపరిస్థితి..

కరీంనగర్ జిల్లా చొప్పదండి సమీపంలోని రెవెల్ల నుంచి ప్రారంభమయ్యే ఎస్సారెస్పీ డీ–83 కాలువ పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్‌లో కలుస్తుంది. అక్కడి నుంచి ఆర్ఎస్‌బీ కాలువ ద్వారా బేగంపేట, మంథని, నాగారం ప్రాంతాల మీదుగా చివరి ఆయకట్టు ఎక్లాస్‌పూర్, ఖానాపూర్ గ్రామాల వరకు చేరుతుంది. అలాగే ఎల్ఎస్‌బీ ద్వారా కమాన్‌పూర్, పెంచికల్‌పేట మీదుగా సింగరేణి ప్రాంతాల్లోని పంటపొలాలకు చేరుతాయి. ఇలా ఆర్ఎస్‌బీ ద్వారా 39.43 కి.మీ. పొడవున కాలువ నిర్మించారు. అలాగే మొయిన్ కెనాల్ సుమారు 40 కి.మీ., పిల్లకాలువలు 80 కి.మీ. పొడవున విస్తరించి ఉన్నాయి. వీటి కింద సుమారు 40వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

ఆనవాళ్లు లేకుండా..

పంటలకు సాగునీరు అందించే కాలువలను సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటినుంచి పూర్తిస్థాయిలో మరమ్మతు చేసిన దాఖలాలు లేవు. దీంతో కాలువల్లో పెద్దఎత్తున పూడిక పేరుకు పోయింది. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. అంతేకాదు.. చెత్తాచెదారం, పెద్దచెట్లు, తుంగ.. ఇలా కాలువల్లో పూడిక నిండి వాటి ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఎస్సారెస్పీ కాలువ నుంచి నీటి విడుదల ప్రాంతంచివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరడానికి గగనమవుతోంది. పంటలకు నీటిని పట్టించడానికి అధికారులు, అన్నదాతలు నానాయాతన పడుతున్నారు. ఆనవాళ్లు లేనికాలువ ద్వారా నీటిధార సన్నగా రావడం.. ఒకవేళ వచ్చినా అటు, ఇటుగా పారడంతో సాగునీటి సరఫరా అధికారులకు కూడా కత్తిమీదసాముగా తయారవుతోంది.

4వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం..

ఎస్సారెస్పీ డి–83 పరిధిలో సుమారు 4 వేల ఎకరాలు చివరి ఆయకట్టు కింద ఉన్నాయి. యాసంగిలో దీనిపరిధిలో వేసిన పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మంథని మండలం ఎక్లాస్‌పూర్, ఖానాపూర్ గ్రామాలు చివరన ఉన్నాయి. ఎక్లాస్‌పూర్ పరిధిలోని పంటలకు ఎలాగోలా సాగునీరు చేరుతున్నా.. ఖానాపూర్ ఆయకట్టుకు నీరు వెళ్లే పరిస్థితి లేదు. కాలువలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. అలాగే ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌తోపాటు ఇతర గ్రామాలకు సాగునీరు చేరక పంటలు ఎండిపోయే దశకు చేరువలో ఉన్నాయి. ఉపాధిహామీ పథకంలో మరమ్మతులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా.. స్థానిక అధికారుల్లో సమన్వయ లోపం శాపంగా మారుతోంది. జిల్లాలోని కాలువల పరిస్థితిపై కలెక్టర్‌కు ఇటీవల అధికారులు నివేదించగా మరమ్మతులు చేసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం.

చివరి ఆయకట్టుకు సాగునీరు

సాగునీటి కాలువల్లో కొన్నిచోట్ల చెట్లు, చెత్త పేరుకుపోయి ఉన్నా.. ఆయకట్టు చివరి పంటలకు సాగునీటిని చేరవేస్తున్నాం. కాలువల మరమ్మతు కోసం కలెక్టర్ నివేదిక కోరారు. కాలువల్లో నీటిధార ఆగిపోయి.. అనువుగా ఉన్న సమయంలో మరమ్మతు చేస్తాం.
– బలరామయ్య, ఈఈ, నీటిపారుదల

మంత్రికి విన్నవించాం



సాగునీటి కాలువల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఇటీవల విన్నవించాం. స్పందించిన మంత్రి.. తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే మరమ్మతులు చేపడతారు.
– ముస్కుల సురేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీఅక్కపల్లి రాజరాజేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని వాగులో బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. సదరు మహిళ 70ఏళ్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు ధర్మపురి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రంగా ఉంచినట్లు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి వ్యక్తి మృతి

వెల్గటూర్ : బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన జగదేవుపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం జైన గామానికి చెందిన సంగెపు మహేశ్ (40) ఉపాధి నిమిత్తం ముంబయిలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. పదేళ్లుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామంలోని బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం సోమవారం కుటుంబంతో కలిసి వచ్చాడు. బుధవారం బహిర్భూమికని గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. మృతుడి భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వెల్గటూర్ : క్రిమిసంహారక మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎండపల్లి మండలం గొడిశెలపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లె లచ్చయ్య (58) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. పదిహేనేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నా ఆరోగ్యం బాగుపడడంలేదు. జీవితంపై విరక్తి చెంది సోమవారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

తండ్రికి కూతురు తలకొరివి



తండ్రి చితికి నిప్పుపెడుతున్న కూతురు రజిత

గొల్లపల్లి: కూతురే కొడుకై కన్నతండ్రికి తలకొరివి పెట్టిన ఘటన మండలంలోని భీంరాజ్‌పల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బక్కయ్యకు ఒక్కతే కూతురు. దండేపల్లి మండలం పాతగూడూరుకు చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశాడు. కొద్దిరోజులుగా కూతురు వద్దనే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి హఠాన్మరణం చెందాడు. దీంతో ఆయన స్వగ్రామమైన భీంరాజ్‌పల్లికి బుధవారం ఉదయం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. బక్కయ్యకు కుమారులు లేకపోవడంతో కూతురు రజిత తండ్రికి తలకొరివి పెట్టింది.

అక్రమ కట్టడాలు కూల్చివేత

మేడిపల్లి: భీమారంలోని ప్రభుత్వ భూములు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను తహసీల్దార్ రవికిరణ్ రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేయించారు. 1308 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు సంఘాల పేరిట నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు ఆలయాలు, ఈద్గాలు నిర్మించారు. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం లేకపోవడంతో వేరే గ్రామంలో నిర్మిస్తారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో గ్రామస్తులు భూములకబ్జా విషయాన్ని తెరపైకి తీసుకొచ్చి వాటిని తొలగించాలని, ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని తీర్మానించారు. రెండురోజుల క్రితం రైతు, కుల సంఘాలు తహసీల్దార్ కార్యాలయం ముందు బైటాయించి ఆందోళనకు దిగారు.

హోమియోతో మొండి వ్యాధులకు చెక్

- రెండో ప్రధాన వైద్యంగా గుర్తింపు
- నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం



కరీంనగర్‌టౌన్: హోమియోపతి ప్రపంచవ్యాప్తంగా రెండవ ప్రధాన వైద్యంగా గుర్తించబడింది. సాంప్రదాయ వైద్యానికి స్పందించని దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఈ వైద్యం ఎంతగానో పనిచేస్తుంది. గతంలో తెలుగు రాష్ట్రాల్లో మెదడువాపును నయం చేయడంలో, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ వంటి ఎన్నో వ్యాధులను నయం చేయడంలో హోమియో వైద్యం పనితనం అందరికి తెలిసింది. పలు మొండి వ్యాధులను నయం చేయగల శక్తి ఉందనే నమ్మకంతో ఈ వైద్య విధానాన్ని ఆశ్రయిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉంది. జర్మనీలో 1755 ఏప్రిల్ 10వ తేదీన జన్మించిన డాక్టర్ శామ్యూల్ హానిమన్ తన రెండు దశాబ్దాల పరిశోధన అనంతరం.. ప్రపంచానికి హోమియో వైద్యాన్ని అందించారు. ఆయన స్మృత్యర్థం ఏటా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచ హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

జీవనశైలికి అనుగుణంగా

మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులు వాడుతూ రోగాలు నయం చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఏళ్ల తరబడి మందులు వాడాల్సి వచ్చే దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునేందుకు హోమియో సేవలను వినియోగించుకుంటున్నారు. కీళ్ల, మోకాళ్ల, నడుం నొప్పులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, షుగర్, బీపీ, థైరాయిడ్, కిడ్నీలో రాళ్లు, అస్తమా, మలబద్ధకం, అర్షమొలల, సోరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధులకు హోమియోపతిలో చికిత్స అందుబాటులో ఉంది.

శాశ్వత పరిష్కారం కోసం

రోగం నయం చేయడంలో కాస్త ఆలస్యమైనా ఖచ్చితంగా ఫలితం ఉంటుందనే నమ్మకమే హోమియోపతి సేవలు పెరగడానికి కారణంగా తెలుస్తోంది. శాశ్వత పరిష్కారం దొరుకుతుండడం ఒక కారణం. ముఖ్యంగా మొండి వ్యాధులకు మెరుగైన చికిత్స అందుతుండడంతో రోగులు హోమియోపతి వైపు మొగ్గుచూపుతున్నారు.



అన్ని వ్యాధులకు చికిత్స

హోమియోలో అన్ని వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉంది. సంతానసాఫల్యత, కీళ్లనొప్పులు, మెడనరాల నొప్పి, నడుమునొప్పి, సయాటికా, థైరాయిడ్, హార్మోన్ సంబంధ వ్యాధులు, కిడ్నీ స్టోన్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఖచ్చితమైన చికిత్స అందుతుంది. అస్తమా, తరచు జలుబు, జ్వరం, టాన్సిల్స్ పెరుగుదల, జ్ఞాపకశక్తి తగ్గడం, నిద్రలోమూత్ర విసర్జన వంటి అన్ని వ్యాధులకు హోమియో సమాధానం చెబుతుంది. అందువల్ల హోమియోకు ఆదరణ పెరుగుతోంది.

– డాక్టర్ కొడిత్యాల శ్రీనివాస్, మాతృశ్రీ హోమియోక్లినిక్

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- ట్రాక్టర్‌తో సహా బావిలోపడి చిన్నారి మృతి




చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

కరీంనగర్‌రూరల్: ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి పసి ప్రాణం బలైంది. సదరు వ్యక్తి ట్రాక్టర్‌కు ఉన్న తాళం చెవిని తీయకపోవడంతో తెలియక స్టార్ట్ చేసిన చిన్నారి ట్రాక్టర్‌తో సహా బావిలో పడి మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లెకు చెందిన గడ్డం రమ్య– అజీందర్‌రెడ్డికి ఇద్దరు కూతుర్లున్నారు. పెద్దకూతురు జశ్విత(3)ను మూడు రోజుల క్రితం తన అక్కబావలు అన్నాడి మంజుల– రాజిరెడ్డి ఊరైన కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటకు పంపించారు. బుధవారం చింత చెట్టు కొట్టేందుకు కూలీలు రావడంతో చెట్టుకింద ఉన్న ట్రాక్టర్‌ను రాజిరెడ్డి కుమారుడు అభిరామ్‌రెడ్డి చిన్నారి జశ్వితను సీటు పక్కనే కూర్చుండబెట్టుకుని వ్యవసాయబావి ముందు నిలిపి కిందకుదిగి వెళ్లిపోయాడు. ట్రాక్టర్‌పై ఉన్న జశ్విత తాళం చెవిని తిప్పడంతో స్టార్ట్ అయిన ట్రాక్టర్ వేగంగా ముందుకు పోయి బావిలో పడిపోయింది. స్థానికులు క్రేన్‌సాయంతో ట్రాక్టర్‌ను బావిలో నుంచి బయటకు తీశారు. ట్రాక్టర్ కింద పడిన జశ్విత ఊపిరి ఆడక బావిలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడికి వచ్చి మృతిచెందిన చిన్నారిని గుండెలకు హత్తుకుని రోధించిన తీరు చూసి స్థానికులు కంటతడిపెట్టారు. పోలీసులు చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి జశ్విత తండ్రి అజీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

కోడికోసం వెళ్లి.. బావిలో పడి..

- వ్యవసాయ బావిలో పడి రైతు దుర్మరణం



రాజేశం

కమాన్‌పూర్(మంథని): వరి పంటను కోసేందుకు సిద్ధమైన రైతు నామని రాజేశం(70) ఆచారం ప్రకారం పొలం వద్ద కోడిని బలిచ్చే ప్రయత్నంలో సమీప వ్యవసాయ బావిలోపడి దుర్మరణం చెందాడు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్ధిపల్లెలో బుధవారం ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో తనకున్న వరిపొలం వద్దకు బుధవారం ఉదయం కోడిని పట్టుకుని వెళ్లాడు. వరి పైరు కోసేందుకు ముందుగా కోడిని బలి ఇవ్వాలని నిర్ణయించాడు. తనవెంట తెచ్చుకున్న సంచిలోనుంచి కోడిని తీస్తుండగా అది ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడింది. రాజేశం ఆ కోడిని పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు ఆ బావిలో పడి మృతి చెందాడు. చాలాసేపటి వరకు రాజేశం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ అటూఇటూ చూడగా ఎక్కడా కనిపించలేదు. చివరకు వ్యవసాయ బావిలో చూడగా శవమై కనిపించాడు. అప్పటిదాకా తమతో ఉన్న రాజేశం బావిలోపడి విగతజీవిగా మారడంతో కుటుంబసభ్యుల విలపించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసుకొన్నారు.

హార్వెస్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



ఘటనా స్థలం వద్ద హార్వెస్టర్, ఆర్టీసీ బస్సు

తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలోని సాయిబాబా ఆలయం సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సు హార్వెస్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సులోని పలువురితోపాటు, హార్వెస్టర్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో పోలీసుల రెండు గంటలు శ్రమించి బయటకు తీశారు. ఎల్‌ఎండీ పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి 12:40 గంటల సమయంలో ఇందిరానగర్ గ్రామ సాయిబాబా గుడివద్ద కరీంనగర్ వైపు వెళుతున్న హార్వెస్టర్‌ను హైదరాబాద్ నుంచి కరీంనగర్‌వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో హార్వెస్టర్ రోడ్డు అవతలివైపుదూసుకెళ్లి బోల్తాపడింది. బ్లేడ్‌లు మాత్రం బస్సులు ఇరుక్కుపోయాయి. ఈ ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ప్రమాదంలో బస్సులోని పలువురితోపాటు హార్వెస్టర్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. హార్వెస్టర్ డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే 108, ఎల్‌ఎండీ పోలీసులు సమాచారం అందించారు. దాదాపు 2 గంటలకు పైగా పోలీసులు, గ్రామస్తులు, హైవే పెట్రోల్ సిబ్బంది, మూడు 108 అంబులెన్స్ సిబ్బంది శ్రమించి బయటకు తీయగా.. మోకాలు విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

తండ్రిని చంపిన కొడుక్కి యావజ్జీవం

జగిత్యాలజోన్: కని, పెంచిన తండ్రిని కర్కశంగా హత్య చేసిన కొడుక్కి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం గొడిశెలపేట గ్రామానికి చెందిన రెబ్బాసు పోచయ్య, మల్లవ్వకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. వీరికున్న ఇంటితోపాటు ఇంటి స్థలాన్ని పెద్ద కుమారుడు లచ్చయ్య, చిన్న కుమారుడు గట్టయ్యకు సమానంగా పంచి ఇచ్చారు. తనకు వాటాగా వచ్చిన స్థలాన్ని గట్టయ్య విక్రయించగా లచ్చయ్య కొన్నాడు. తల్లిదండ్రులు లచ్చయ్య ఇంటివద్దే ఉంటున్నారు. తన ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ లచ్చయ్య తల్లిదండ్రులతో గొడవకు దిగుతున్నాడు. వారికి ప్రత్యామ్నాయం లేక లచ్చయ్య వద్దే ఉంటున్నారు. 2022 ఏప్రిల్ 1న ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ తల్లిదండ్రులను కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. పోచయ్య అరుపులు విని చుట్టుపక్కల వారు వచ్చేసరికి లచ్చయ్య పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన పోచయ్యను కరీంనగర్‌కు.. అక్కడి నుంచి వరంగల్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి వెల్గటూర్ ఎస్సై ఎ.నరేశ్‌కుమార్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బిల్లా కోటేశ్వర్ కేసును దర్యాప్తు చేసి నిందితుడు రెబ్బాసు లచ్చయ్యను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, వి.శ్రీధర్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టగా పరిశీలించిన జడ్జి నిందితుడైన లచ్చయ్యకు యావజ్జీవ కారాగారశిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హనుమాన్ చిన్న జయంతికి ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: హనుమాన్ చిన్న జయంతికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి బుధవారం అధికారులతో సమావేశమయ్యారు. ఈనెల 11 నుంచి జయంతి కార్యక్రమాల నేపథ్యంలో పదో తేదీలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కిందిస్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు రోజులపాటు లైటింగ్, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని, 11న రాత్రి నుంచి 13వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, సుమారు 45వేల మంది భక్తులు మాలవిరమణ చేస్తారని, మూడు రోజులపాటు 14 కౌంటర్లను ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆలయ ప్రాంగణంలో 64 సీసీకెమెరాలు ఉన్నాయని, అదనంగా 50 సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తామని, ఆరు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఇందుకోసం వేదిక ఏర్పాటు చేసి వందమంది కూర్చునేలా సిట్టింగ్ ఉండాలని సూచించారు. చలువ పందిళ్లు, కోనేరు వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, కల్యాణ కట్ట వద్ద నాయీబ్రాహ్మణులను ఎక్కువగా నియమించుకోవాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో షిఫ్టుల వారిగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కొండగట్టు ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, మదన్‌మోహన్, మున్సిపల్ కమిషనర్ స్పందన పాల్గొన్నారు.

భర్తతోనే కలిసి ఉంటా..

- కరీంపేటలో మహిళ ఆందోళన



బాధితురాలికి మద్దతు పలికిన మహిళా సంఘాలు

శంకరపట్నం: భర్తతోనే కలిసి ఉంటానని ఓ మహిళ ఆందోళనకు దిగగా.. పలు మహిళా సంఘాలు మద్దతుగా నిలిచాయి. బాధితురాలి వివరాల ప్రకారం.. మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన గడ్డం రాజు మొదటి భార్య, ఇద్దరు పిల్లలు చనిపోయారు. చొప్పదండి మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన స్వప్నను రెండో వివాహం చేసుకున్నారు. మూడు నెలలుగా స్వప్నను భర్త, అత్తింటివారు వేధిస్తున్నారు. కొంత డబ్బు ఇచ్చి, వదిలించుకోవాలని చూస్తున్నారని, భర్తతోనే కలిసి ఉంటానని స్వప్న ఆరోపించింది.

ఆల్ ఇండియా పోలీస్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



మాధవి, సాయికృష్ణ

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జరుగుతున్న ఆల్ ఇండియా పోలీస్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ క్లస్టర్ పోటీలకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు తెలిపారు. రామడుగుకు చెందిన అనుపురం సాయికృష్ణ ప్రస్తుతం మంచిర్యాలలో, కుర్మపల్లికి చెందిన పులి మాధవి ప్రస్తుతం రామగుండం కమిషనరేట్‌లో పనిచేస్తున్నారు. వీరి ఎంపికపై ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, వేల్పుల సురేందర్, కృష్ణహరి, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ కార్యవర్గం



రాజయ్య



శ్రీకాంత్‌గౌడ్


సుల్తానాబాద్(పెద్దపల్లి): బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికలు ప్రకటించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజయ్య, ఉపాధ్యక్షులుగా లింగయ్య, సీహెచ్ గోపాల్, ఎండీ సాహెబ్ హుస్సేన్, సహాయ కార్యదర్శిగా బూరుగు శ్రీకాంత్‌గౌడ్(సుల్తానాబాద్), కోశాధికారిగా మల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా రామయ్య, కార్యవర్గ సభ్యులుగా జహంగీర్ హుస్సేన్, బొంద్యాలు, అంజయ్య, రఫీ, రవి, రాజు, తిరుపతి, శ్రీనివాస్, లింగయ్య ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్‌నెట్ బృందం పరిశీలన


మంథని: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి తెలుసుకునేందుకు స్కూల్‌నెట్ బృందం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించింది. ప్రస్తుత పరిస్థితులు, అవసరమైన వసతుల కల్పనపై అధ్యయనం చేసింది. రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్కూల్‌నెట్ సీనియర్ మేనేజర్ శివప్రసాద్, అకడమిక్ మేనేజర్ నర్సింగ్‌దాస్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ మల్లేశ్‌గౌడ్ మంథని బాలుర, బాలికల జెడ్పీ, ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. బాలుర గురుకుల విద్యాలయం, గుంజపడుగు జెడ్పీ బాలుర హైస్కూల్, ముత్తారం కేజీబీవీ, టీజీఎంఎస్, రామగిరి కేజీబీవీని సందర్శించారు. అనంతరం పెద్దపల్లిలో కలెక్టర్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే పనులపై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

శుచి.. శుభ్రతకు తిలోదకాలు


- నాసిరకం ఆహార పదార్థాల విక్రయాలు
- గడువు తీరిన వాటిని అమ్ముతున్న వైనం
- బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో అధ్వానంగా తయారైన పరిస్థితి
- రామగుండం బల్దియా అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..



ఇవి కేక్‌లు తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు, ముడిపదార్థాలు. 2022 డిసెంబర్‌లో వీటిని తయారు చేసినట్లు బాటిళ్లపై ముంద్రించి ఉంది. తయారీ తర్వాత 24 నెలల్లోపే వీటిని వినియోగించాలి. కేక్‌పై పూయడానికి వినియోగిస్తున్న క్రీమ్‌బాటిల్‌పై 2023 సెప్టెంబర్ 26న తయారు చేసినట్లు ముద్రించి ఉండగా, 2024 సెప్టెంబర్ 24లోపే వినియోగించాలని ఉంది. రామగుండం బల్దియా అధికారులు బుధవారం ఓ బేకరీలో తనిఖీ చేయగా ఇవి వెలుగులోకి వచ్చాయి.



అపరిశుభ్రంగా కనిపిస్తున్న ఈ ఆయిల్ డబ్బాను గమనించారా? గోదావరిఖనిలోని ఓ బేకరీలో ఇందులోని ఆయిల్‌తోనే సమోసాలు తయారు చేస్తున్నారు. వాడిన ఆయిల్‌నే మళ్లీ వినియోగిస్తున్నారు. రంగుమారి మడ్డిపట్టి ఉంది. బల్దియా అధికారుల తనిఖీల్లో ఇది వెలుగు చూసింది.



ఈ రెండు డబ్బాల్లో కనిపిస్తున్న ఆహార పదార్థాన్ని ఎగ్‌పఫ్, కర్రీపఫ్‌లో పెట్టి విక్రయిస్తున్నారు. మంగళవారం తయారు చేసిన బేకరీ నిర్వాహకులు.. మిలిగిన ఆహారాన్ని బుధవారం ఉపయోగించడానికి ఫ్రిజ్‌లో నిల్వచేశారు. అధికారుల తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది.



బేకరీ నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న బల్దియా అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): హోటల్, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లి ఏదైనా ఆహారం తినాలని అనుకుంటున్నారా? అయితే, చాలా జాగ్రత్తలు తీసుకోండి. ఆహారం తయారీలో వినియోగించే పదార్థాలు నాసిరకంగా ఉంటున్నాయి. గడువు దాటిన, పురుగులు పట్టిన వాటితోపాటు కల్తీ మసాలాలు, అనేకసార్లు కాచిన నూనె వినియోగిస్తున్నారు. శుభ్రత అస్సలు పాటించడంలేదు. వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు వాడుతున్నట్లు రామగుండం నగర పాలక అధికారులు బుధవారం చేసిన తనిఖీల్లో గుర్తించారు.

ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం..

బల్దియా పరిధిలోని కొన్ని హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం సాగిస్తున్నాయి. నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. ముఖ్యంగా బేకరీల్లోని ఎగ్‌పఫ్, కర్రీపఫ్ తదితర పదార్థాలు పాచిపోయినా పడేయకుండా వేడిచేసి విక్రయిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిస్థితి మరీదారుణంగా ఉంది. అనేకసార్లు కాచిన నూనెను నూడిల్స్, ఫ్రైడ్‌రైస్, మంచూరియా తయారీకి వినియోగిస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు సహజ రంగులకు బదులు సింథటిక్ రంగులు వాడుతున్నారని ఆరోపణలున్నాయి. బిర్యానీ సెంటర్లు, హోటళ్లలోనూ అదే దుస్థితి నెలకొంది. నాణ్యతలేని కూరగాయలు, దినుసులు, కాలంచెల్లిన మసాలాలు, ఇతర సరుకులు వినియోగిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు బల్దియా అధికారులు చేసిన దాడుల్లో నాణ్యతలేమి, గడువుతీరిన ముడిసరుకులు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. ఇంత జరుగుతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

బేకరీ నిర్వాహకుడికి రూ.20 వేల జరిమానా

గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని సిరి కేక్స్, మోర్‌షాప్ నిర్వాహకుడికి రామగుండం నగర పాలక సంస్థ అధికారులు బుధవారం రూ.20వేల జరిమానా విధించారు. కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ కిరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బేకరీలో గడువు దాటిన ముడిపదార్థాలు, అపరిశుభ్ర వంటశాలలో కేక్‌లు, మిఠాయిలు తయారు చేస్తూ, నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ సంచుల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కాలంచెల్లిన రసాయనాలు, ఇతర పదార్థాలు వినియోగిస్తున్నారని తేల్చారు. ఈ మేరకు జరిమానా విధించారు. ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.